కథ

# నా మనసంతా నువ్వే!?!

శ్రీమతి న్యాయపతి కమలా రాంజీ

**ఆ రోజు కార్తీక పౌర్ణమి! అన్ని కోవెళ్లు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఉదయం నుండి ఉపవాసం వున్న భక్తులు, సూర్యభగవానుడు సంధ్యాదేవి వడిలో సేదదీరుతున్న సమయాన కార్తీకదీపాలు వెలిగించి ఆ భగవంతునికి భక్తితో తమ హృదయ వేదనల్ని విన్నవించుకుంటున్నారు. కార్తీక దీప కాంతులతో ఇంచుమించు వూరంతా కళకళలాడుతోంది.**

అరవై ఐదు సంవత్సరాలు పైబడిన వసుంధర నెమ్మదిగా వచ్చి తులసి కోట దగ్గర మట్టి ప్రమిదల్ని వెలిగించింది. ఆ దీపకాంతుల మధ్య పండు ముత్తయిదువులా వున్న ఆవిడ ముఖం మీది ముడతలు వార్థక్య లక్షణాలని స్పష్టంగా తెలియజేస్తున్నాయి! పచ్చటి మేనిఛాయ, పసుపు రాసుకున్న ముఖం, నుదుట నయాపైసంత కుంకుమబొట్టు, రెండు చేతుల నిండా ఎర్రటి మట్టి గాజులు, వెడల్పు జరీ అంచున్న ఎర్రటి చీరలో వసుంధర, నిండైన విగ్రహంతో, మారువేషం వేసుకొచ్చిన పార్వతీదేవిలా వుంది! ఆ సంధ్యవేళ ఆమె వెలిగించిన దీపాలు వింతకాంతుల్ని వెదజల్లుతున్నాయి.

శ్రీనివాసరావుగారు వాకిట్లో ఒక మూల సరిగ్గా లైటు వెలుతురు పుస్తకం మీద పడేలా వాలు కుర్చీ వేసుకుని భక్తి పుస్తకాలు చదువుతూ దైవ ధ్యానంలో మునిగిపోయి వున్నారు. వసుంధర వడపప్పు, అరటిపళ్లు తులసమ్మకి నైవేద్యంపెట్టి అగరువత్తులు వెలిగించి భక్తితో కనులు మూసుకుని కొంతసేపు భగవంతుని ధ్యానం చేసుకుంది. ఆవిడకి కీళ్ల వాపులు! కూర్చుంటే లేవలేదు. లేస్తే కూర్చోలేదు. "అమ్మ! అబ్బ!" అని ఆయాస పడుతూనే నెమ్మదిగా అన్ని పన్లు చేసుకుంటుంది ఆవిడ! తదేకంగా ఆవిడనే చూస్తున్న శ్రీనివాసరావు గారు అన్నారు. "మనం పడమటి దిశకు చేరుకున్నాం వసూ! పిల్లలు పెద్దవాళ్లయిపోయి అమెరికాలో సెటిలయి పోయారు. వాళ్లిప్పుడు విదేశీ గాలి పీల్చుకుంటూ విదేశీ సంస్కృతి వంట బట్టించుకుంటున్నారు!"

"అవునండీ! వాళ్లకి ఈ దేశం అక్కర్లేదు. మాతృభూమి, మాతృభాష అక్కర్లేదు! మనల్ని అక్కడికి వచ్చేమంటారు! కాని మనం ఈ మట్టి వదిలి వెళ్లలేం" అంది ఆవిడ నిట్టూరుస్తూ.

"పోనీ లే వసూ! రెక్కలొచ్చిన పక్షులు ఎగిరిపోక తప్పదు. రెక్కలు విరిగిన మనం ఎన్నాళ్లుంటాం చెప్పు?!

వాసాంసి జీర్ణాని యథావిహాయ
న వాని గృహ్ణో తినరోప రాణి!
తథా శరీరాణి విహాయ జీర్ణా
న్య న్యాని సంయాతి నవాని దేహీ!!

మానవుడు ఏ విధంగా పాత వస్త్రాలను వదిలిపెట్టి వేరే కొత్త వస్త్రాలను ధరిస్తూ వుంటాడో అట్లే దేహాలను ధరించుచున్న ఆత్మ, నశించిన పాత శరీరాలను వదిలిపెట్టి కొత్త శరీరాలను ధరిస్తూ వుంటుంది! పునరపి జననం పునరపి మరణం! అవును. మన భౌతిక శరీరాలు ఈ మట్టిలోనే కల్సిపోవాలి! అదే నా కోరిక కూడా! కాని వసూ! కనీసం ఆఖరి చూపుకైనా వాళ్లు వస్తారంటావా? నాకు మాత్రం నమ్మకం లేదు!" ఆయన స్వరంలో బాధ సుళ్లు తిరిగింది.

"పిల్లలు మన దగ్గరలేరు. అంతదూరంలో వున్నారన్న చింత మీలో బాగా వున్నట్టుంది. ఏ విషయం అయినా పదేపదే తలచుకుని మనసుని కష్టపెట్టుకోవడం అనవసరం. అలాగని నిరంతరం మనల్ని ప్రశ్నించే మనసుని అణగదొక్కమనడం లేదు. అసలు మనం ఎవరం? నిమిత్త మాత్రులం, మన చేతుల్లో ఏమీ లేదు. అంతా ఆపైనున్న పరమాత్ముడి చేతిలోనే వుంది!" విరక్తితో కూడిన చిరు మందహాసం ఆవిడ పెదవుల మీద కదలాడింది. ఇద్దరూ లోపలికి నడిచారు.

తెల్లవారింది. అందరూ దైనందిన కృత్యాల్లో మునిగిపోయారు. అప్పుడే స్నానం చేసి ఇవతలకి వచ్చేరు శ్రీనివాసరావు గారు. ఆయన శరీరం మీద అక్కడక్కడా ఆరకుండా మిగిలిన నీటిబిందువులు ఆ ఉషః కాంతిలో వింతగా మెరుస్తున్నాయి.

"ఏవండీ!" అన్న పిలుపు వినిపించింది వీధి గుమ్మం వైపు నుండి.

"ఎవరూ?!" అంటూ అటువైపు వెళ్లేరు శ్రీనివాసరావు గారు.

"మేం ఈ పక్కింట్లో అద్దెకి దిగేం అండి. నిన్న సాయంత్రం మిమ్మల్ని చూసేను. ఊరికేతోచక మిమ్మల్ని పరిచయం చేసుకుందామని ఇలా వచ్చాను" అతను డెబ్బయ్యేళ్ల వృద్ధుడైనా ఆరడుగుల ఆజాను బాహువు. ఆ వయసులోనే అంత అందంగా వున్నాడంటే మాంఛి వయసులో వున్నప్పుడు ఎలా వుండేవాడో?! వయసు మీదపడినా వర్చస్సు ఏ మాత్రం తగ్గలేదు. దళసరి కళ్లజోడు లోంచి పరికించి చూస్తున్న ఆయన్ని శ్రీనివాసరావు గారు రమ్మని మర్యాదగా ఆహ్వానించేరు. ఇద్దరూ హాల్లో కూర్చున్నారు. అసలే కబుర్లుచెప్పే వాళ్లు లేక బోరుకొట్టి ఛస్తున్న శ్రీనివాస రావుకి అతని రాక చాలా సంతోషం కలిగించింది!

"మేం ఈ పక్కింట్లో ఈ మధ్యనే దిగేం. నాకు ఒక్కడే కొడుకు. నా కొడుకు – కోడలు ఇద్దరూ ఉద్యోగాలకి వెళ్లిపోతే నాకు ఏమీతోచదు. పాతిక సంవత్సరాల క్రితమే నా భార్య పోయింది! టి.వి. చూద్దామన్నా ఎంతకని టి.వి. చూస్తాం చెప్పండి! టి.వి. సీరియల్స్ చూసి మనలాంటి వాళ్లు కొత్తగా నేర్చుకోవాల్సింది ఏమీలేదు. ఎవరు అసహ్యించుకున్నా, ఎవరు ఆనందించినా, ఎవరు తిట్టుకున్నా టి.వి సీరియల్స్ తీసే వాళ్లు వాళ్ల పద్ధతిలోవాళ్లు తీస్తూనే వుంటారు! అంతా కమర్షియల్ యుగం అయిపోయింది. పోనీ ప్రశాంతంగా దేవుడ్ని ధ్యానిద్దామంటే ఈ దేవుళ్ల మధ్య కూడా పోటీతత్వం పెరిగిపోయింది! "మీ దేవుడు – మా దేవుడు" అంటూ, గొడవలకి దిగేభక్తులు ఎక్కువయ్యారు! ఇంకేం చెయ్యడం చెప్పండి..."

గలగలా మాట్లాడేస్తున్న అతన్ని చూసి ముచ్చటేసింది శ్రీనివాసరావుకి.

వసుంధర కాఫీ కప్పులు తెచ్చి అక్కడ పెట్టింది.

అతని వైపు సరిగ్గా చూడ లేదు.

"మా ఆవిడ!" పరిచయం చేసాడు శ్రీనివాస రావు.

"నా బాల్యం, కాలేజీ చదువు అంతా విజయనగరంలోనే! ఉద్యోగం మాత్రం హైదరాబాదులో దొరికింది. అక్కడే వివాహం జరిగింది. గొప్పింటి పిల్లని మా నాన్నగారు ఏరికోరి పెళ్లి చేసేరు! పెళ్లయిన మూడేళ్లు అనుమానంతో నాకు నరకం చూపించింది! ముళ్ల కంపకి చీరకట్టినట్టున్న ఆమెతో ఎలాగో కాపురం చేసేను. కొడుకు పుట్టేడు. అంతే. అదేదో మాయదారి జబ్బొచ్చి చనిపోయింది. అదృష్టం అందర్నీ వరించదండీ. మీరు అదృష్టవంతులు!" అడిగినా అడక్కపోయినా తన విషయాలను అన్నీ చెప్పుకొచ్చిన అతను ఆఖరి మాట దేనిని దృష్టిలో పెట్టుకుని అన్నాడో తెలీదు!

"విజయనగరం" అన్న మాట వినేసరికి వసుంధర తనువు – మనసు పులకించి పోయేయి! ఆమెలో ఒక్కసారిగా చైతన్యం కలిగింది. అనుకోకుండా ఆవిడ అడిగింది.

"మీరు ఏ వీధిలో వుండేవారు?" అని.

"షరాఫ్‌ఖానా వారి వీధిలో వుండేవాళ్లం. దాన్నే ఇప్పుడు గురజాడ అప్పారావుగారి వీధి అని అంటున్నారు లెండి. ఎందుకంటే ప్రఖ్యాత కవి, నాటకకర్త అయిన గురజాడ అప్పారావు గారు ఆ వీధిలోనే వుండే వారు. వారి ఇంటి పక్కనే వారి పేరు మీద గురజాడ గ్రంథాలయం ఇప్పటికీ వుంది" చెప్పాడ తను.

వసుంధర అణువణువూ ఆనందంతో తొణికిసలాడుతోంది. సూటిగా అతని ముఖంలోకి చూడకుండా కొద్దిగా తలదించుకుని మాట్లాడుతోంది ఆవిడ. విజయనగరం గురించి ఎవరైనా మాట్లాడుకున్నా, ఆ పేరు విన్నా ఆవిడ సంతోషం పట్టలేదు. ఆవిడకి ఆ విజయనగరంతో వున్న అనుబంధం అలాంటిది... "అక్కడికి దగ్గరగా విజయనగరం మహారాజా వారి కోట, కోట చుట్టూ శత్రువులు కోటలోకి ప్రవేశించకుండా దృఢంగా కట్టబడిన కందకం, ఎదురుగా బొంకుల దిబ్బ, కోటకి పక్కన మూడు కోవెళ్లు, ఇటు వైపు మూడు లాంతర్లు, ఆ పక్కనే పైడితల్లి అమ్మవారి గుడి, ఏటేటా జరిగే సిరిమాను పండగ, ప్రతీ ఏటా అమ్మవారు వచ్చి కోట గుమ్మానికి ముమ్మారు వంగి దణ్ణంపెట్టి రాజ పురోహితుడిచ్చే పసుపు, కుంకుమలు స్వీకరించడం, కొంచెం దూరంలో మహారాజావారి కళాశాల, సంగీత కళాశాల, హస్తబలు హాలు, ముఖ్యంగా గంట స్థంభం, పెద్ద బజారు, కన్యకా పరమేశ్వరి కోవెల, కాలేజీకి ఎదురుగా కుడి వైపు పెద్ద చెరువు... ఓహ్ ఒకటేమిటి! ఎన్నో ఎన్నో జ్ఞాపకాలు!"

ఆవిడ స్మృతి పథంలో ఏవో చిన్నచిన్న అలలు!...

"మీ పేరు!" అప్పుడు తలెత్తి చూసింది!

"నా పేరు... రాజశేఖరం! మా ఇంటిపేరు రుద్రాభట్ల!" అతని జవాబులో ఎక్కడో చిన్నకొంటెతనం తొంగి చూసినట్టు అనుమానం!? వసుంధర మనసు ఝల్లుమంది! ఆవిడ హృదయం ఆనందోత్సాహాలతో తీయగా మూలిగింది. ఆవిడ మనసులో మాటలకందని వింత అనుభూతి, వర్ణించలేనంత ఆనందం పురివిప్పిన నెమలిలా నాట్యం చెయ్యసాగింది!

రాజశేఖరం! రాజశేఖరం! రుద్రాభట్ల రాజశేఖరం!

ఎలా మర్చిపోతుంది తను!? ఎలా మర్చిపోగలదు తను!? ఈ వయసులో గుండెలో పరిమళాలు నింపవచ్చిన పూగుత్తిలా, అణువణువునా మోహన ప్రకంపనలు పలికించే వీణానాదంలా, మధురమైన రసాస్వాదనలా... ఆమె మనసు భాషకందని భావంలా తీయగా మూలిగింది! అంటే... అంటే... అతను నన్ను పోల్చుకోలేదన్నమాట! "నేను... రాజశేఖరం! నీ వసుని.. చూడు. బాగాచూడు" అని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది! కాని ఎలా చెప్పడం! పక్కన భర్త వుండగా ఎలా చెప్పడం?

"ఎలా... ఎలా... ఎలా...ఎలా... తెలుపను?! నా మనసులోని మాటను?! ఈ గుండెలోని బరువును... ఇన్నాళ్లుగా మోస్తున్న ఈ తియ్యనిభారాన్ని ఎలా దింపుకోను?! ఆమె అక్కడ ఒక్క నిముషమైనా నిలబడలేక పోయింది! లోపలికి వచ్చేసింది! శరీరం ముసలై ముడతలు పడినా మనసుకి ముసలితనం లేదు!?!

"ఛ! తనేమిటి! కృష్ణా-రామా అనుకోవాల్సిన ఈ వయసులో తను అతని గురించి ఆలోచించడం



ఏమిటి? తన పిచ్చి మనసు చిత్రంగా ఇంతటి భావోద్వేగానికి లోనవుతోందేమిటి? తన మనసులో రేగుతున్న ఈ భావ సంచలనాన్ని తన భర్తే కాదు ఆ భగవంతుడు కూడా ఊహించలేడు! తన మనసు అట్టడగు పొరల్లో పదిలంగా దాచుకున్న ఆ అనుభూతుల్ని నెమరు వేసుకునే ప్రయత్నంలో వుంది... ఆమె! ఆవిడకి అంత చలిలోనూ చెమట్లు పట్టేయి. ఆవిడ మనసు ఒక్కసారిగా యాభై సంవత్సరాలు వెనక్కి వెళ్లింది!!....

***

అప్పుడు వసుంధర వయసు పద్ధెనిమిది! విరబూసిన విరజాజిలా, మంచు బిందువులతో తడిసిన ముద్దమందారంలా వుండేది. వాళ్లింటి పక్కనే రాజశేఖరం వాళ్లు వుండే వారు. పక్క పక్క ఇళ్లు కావడం వల్ల కాలేజీలో చదివేటప్పుడు ఇద్దరూ ఒకరి నోట్సులు ఒకరు ఇచ్చి పుచ్చుకునే వారు. తను ఒక్క రోజు కనిపించకపోయినా రాజశేఖరం వడ్డున పడ్డ చేపలా విలవిల్లాడే వాడు! తను కూడా అంతే. రాజశేఖరాన్ని చూడకుండా ఒక్క రోజైనా వుండలేని స్థితికి వచ్చింది. అతను కనిపించకపోతే పిచ్చెత్తి నట్టుగా వుండేది. అది ఎన్ని జన్మల బంధమో మరి!?! ఒకరంటే ఒకరికి ఆరాధన, ప్రేమ, ఇష్టం, ఆకర్షణ, అభిమానం, అనురాగం అన్నీవుండేవి. కాని అప్పటి రోజులు వేరు! అందరి ముందు మనసు విప్పి మాట్లాడుకునే ధైర్యం లేకపోయినా తన పట్ల వున్న ఆరాధన అతని కళ్లల్లో స్పష్టంగా అగుపించేది! ఎవరూ లేని సమయం చూసి ఒక రోజు ధైర్యం చేసి.


''నువ్వు చాలా అందంగా వుంటావు వసూ! నువ్వంటే నాకు చాలా ఇష్టం. నా మనసంతా నువ్వే నిండిపోయి వున్నావు. ఈ ప్రేమని పదిలంగా గుండెలో



దాచుకోవాలో; లేక గుండెగుడిలో నిన్ను దేవతగా పూజించుకోవాలో; లేక పెద్దల నెదిరించి అమాంతం నిన్ను ఎత్తుకు పోయి గాంధర్వ వివాహం చేసుకోవాలో ఏదీ తేల్చుకోలేక నా మనసు నలిగి పోతోంది వసూ!'' అన్నాడు రాజశేఖరం, వసుంధర చాలా సిగ్గు పడిపోయింది అతని మాటలకు! సప్తవర్ణాల ఇంద్రధనస్సు మీద కూర్చుని గాల్లో తేలిపోతున్నట్టు వింతైన అనుభూతి కలిగింది ఆమెకి!! ''మరీ అంత సిగ్గయితే ఎలా? నా మనసులోని మాటను ఎలా తెలుపను ఈ సిగ్గుల మొగ్గకి?! వసూ! మనది జన్మజన్మల బంధం! నీ కోసం నేను! నా కోసం నువ్వు పుట్టాం. నీవు లేని జీవితం వూహలో కూడా భరించలేను! అంతెందుకు! నువ్వు లేని నేను లేను. నువ్వు నా దానివి! నిన్ను నా నుండి ఎవరూ వేరు చెయ్యలేరు!'' భావోద్వేగంతో పలుకుతూ సున్నితంగా ఆమె చేయి నొక్కి వదిలి పెట్టేడు రాజశేఖరం!.....

కాని విధి వక్రించింది! ప్రతీ ప్రేమకథల్లాగే వాళ్లిద్దరి ప్రేమ కథ కూడా అర్థాంతరంగా ముగిసిపోయింది! విషయం తెల్సి రాజశేఖరం తండ్రి అంతెత్తు ఎగిరేడు!

''మన శాఖ వేరు. వాళ్ల శాఖ వేరు. మన అంతస్తు వేరు. వాళ్ల అంతస్తు వేరు! వాళ్ల అంతస్తుకి చేరుకోవడానికి ఎన్ని జన్మలు ఎత్తాలిరా! ప్రేమ దోమ అన్నావంటే పళ్లు రాలగొడతాను. నోర్మూసుకుని వుండు. అయినా మేమంతా ప్రేమించి పెళ్లి చేసుకునే కాపురాలు చేసేమా? మేం హాయిగా లేమా?!'' అంత ఘాటుప్రేమని గుండె గుప్పిట్లో దాచేసుకుని మరి నోరు మెదపలేదు రాజశేఖరం!



ఆ కాలంలో పెద్దల నెదిరించడం, లేచిపోవడం, కనిపెంచిన వాళ్ల మనసుల్ని కష్టపెట్టడం... అలాంటివన్నీ లేవు! ఫలితంగా వసుంధర ఇష్టాఇష్టాలతో పని లేకుండానే కాలేజీ లెక్చరర్ అయిన శ్రీనివాసరావుతో ఆమె వివాహం జరిగిపోయింది. వివాహం అయిన తర్వాత అది మొదటి రాత్రి!....

''మధ్యాహ్నం కాస్సేపు కునుకు తియ్యమ్మా. ఈ రోజు శోభనం తెల్సిందా? తెల్ల వార్లూ నిద్ర వుండదు. చూసుకో...'' అంది వదిన హాస్యంగా. మెడలో పచ్చగా మెరిసిపోతున్న మంగళ సూత్రాల్ని ఒకసారి తదేకంగా చూసుకుని నెమ్మదిగా కళ్లు మూసుకుంది ఆమె.

***

నెమ్మదిగా తలుపు తెరుచుకుని అతి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చిన వసుంధరని అతను విస్ఫారిత నేత్రాలతో చూస్తుండిపోయాడు. ఇంత అందం ఈ క్షణం నించి తన స్వంతం అన్న తలంపు రాగానే ఆనందం పట్టలేకపోయాడు. గుండ్రటి ముఖం, కలువ రేకుల్లాంటి కళ్లు, సంపెంగలా కొనదేలిన నాసిక, ఊరించే పెదవులు, ఎత్తైన వక్ష సంపద, త్రాచు పాములా నిగనిగలాడుతున్న పొడవైన జడ, సౌందర్యాన్నంతా కుప్ప పోసినట్టున్న అందాలరాశి దగ్గరకు రాగానే ఆమె కళ్లల్లోకి ఆరాధనగా చూస్తూ తమకంగా ఆమె పెదవుల్ని సుతారంగా ముద్దు పెట్టుకున్నాడు. ఆమె మత్తుగా కనులు మూసుకుని వుంది. అతని చేతులు నెమ్మదిగా కిందకి జారి నడుము వంపులని తాకి గిలిగింతలు పెట్టాయి. మొట్టమొదటిసారిగా తనువు – మనసు ఏకం కావల్సిన శుభ ఘడియలవి! అతను అప్రయత్నంగా ఆమె వక్ష స్థలం మీద చేతులు వుంచేడు! ఆమె అడ్డు చెప్పలేదు. తన్మయత్వంలో వుంది. ఇద్దరూ పరవశంతో ప్రేమ గీతం.... పాడుకుంటున్న వేళ... రాజశేఖరం... రాజశేఖరం... మత్తుగా పలికాయి ఆమె పెదవులు! హఠాత్తుగా తేరుకుని లేచి గతుక్కుమంది వసుంధర! ఆమె ఆ దిగ్భ్రమ నుండి తేరుకునే లోపునే శోభనం గదిలోకి పంపేరు ఆమెని! శ్రీనివాసరావుతో శోభనం! ఆ రాత్రి తొలి రాత్రి!

***

ఆమె మనసు తీవ్రంగా ఆలోచించసాగింది. ఆమె ఇంతసేపూ తను ప్రాణాధికంగా ప్రేమించిన రాజశేఖరంతో మొదటి రాత్రిని ఊహించుకుంది! కాని హిందూ ధర్మ శాస్త్రానుసారంగా తను చేసింది పొరపాటేనా?! వివాహిత అయిన స్త్రీ పర పురుషుడ్ని మనసులో ''ఆ విధంగా'' తల్చుకో కూడదు! పెళ్లి అంటే నూరేళ్ల పంట అని పెళ్లిళ్లు స్వర్గంలో జరుగుతాయని అంటారు. ఏమిటో తన పిచ్చిగాని! మంత్రాలు – మంగళసూత్రాలు మనుషుల్ని కలపగలవేమో గాని మనసుల్ని కలప లేవు! ఆమెకి కళ్లంట నీళ్లు తిరిగేయి! ఆమె నిర్మించుకున్న ఊహా సౌధం నేల కూలినా వివేకం ఆమెను వెన్ను తట్టి లేపింది. హిందూ సంస్కృతి – సాంప్రదాయం; సామాజిక కట్టుబాట్లు; వివాహ బంధానికున్న విలువ; వివాహిత స్త్రీ పాటించవల్సిన ధర్మాలు అన్నీ ఆమెకు తెల్సు!

''ప్రేమ'' ఒక్కటే జీవితం కాదు, ప్రేమ అన్నది మనసులో ఎప్పటికీ పదిలపర్చుకోవల్సిన తీయని అనుభూతి'' అని అర్థం చేసుకుంది! తనకి ఏమీ కాని రాజశేఖరం కోసం అన్నీ అయిన భర్తని నిర్లక్ష్యం చెయ్యడం న్యాయం కాదు! తర్కవితర్కాలతో అలసిపోయిన ఆమె మనసు కొంత సేపటికి మామూలు స్థితికి చేరుకుంది. శ్రీనివాసరావు ధైర్యంగా ఆమె చేయి అందుకున్నాడు. ఆమె కాదన లేదు. అడ్డు చెప్పలేదు. మంచులో తడిసిన గులాబీలా స్వచ్ఛంగా వున్న ఆమె ముఖాన్ని ముద్దుల్తో ముంచెత్తాడు అతను. అంతవరకు పురుష స్పర్శ ఎరుగని ఆమె ఒక్కసారిగా కదిలిపోయింది. ఆమె శరీరమంతా ఏదో వణుకు. నరాలన్నీ జివ్వుమన్నాయి. అతని మృదువైన స్పర్శ తగులుతూ వుంటే ఆమె శరీరం లోని అణువణువు కంపించిపోయింది.

***

వసుంధర రాజశేఖరం పట్ల తనకున్న ప్రేమను గుండెలోనే గుప్తంగా దాచుకుంది. కాని రోజులు గడుస్తున్న కొద్దీ ఆమె మనసు ఆమె మాట వినకుండా మొండికేసింది. ఎంత వద్దనుకున్నా రాజశేఖరం ఆలోచనలు ఆమె మనసులోపలి పొరల్లో, ఆమె హృదయపు అట్టడుగు లోతుల్లో ''నేనే నీ సర్వస్వం:'' అన్నట్టుగా పాతుకుపోయాయి! రాత్రి భర్త పక్కన పడుకున్నా కూడా రాజశేఖరం ఆలోచనలు ఆమెని వదిలేవు కావు. ఆమె ఊహలు అతని చుట్టూ అల్లుకుపోయేవి! కాని అంతరాత్మ మాత్రం ఎదురు తిరిగేది!

''నువ్వు చేస్తున్న పని తప్పు, భర్తతో కాపురం చేస్తూ పర పురుషుడ్ని తల్చుకోవడం హిందూ స్త్రీకి ధర్మం కాదు. మన హిందూ సంస్కృతికి విరుద్ధమైన ఆలోచనలు చెయ్యకూడదు'' అని ఎప్పటికప్పుడు అంతరాత్మ హెచ్చరించడం మొదలెట్టింది.

ఆమె ఇద్దరు పిల్లల తల్లయినా కూడా పెళ్లయిన పదేళ్ల దాకా రాజశేఖరం నిత్యం ఆమె ఊహల్లోకి వచ్చేవాడు.

''నీతో మాట్లాడకుండా నేను వుండలేను వసూ! నేను నీ వాడిని. నువ్వు నా దానివి. నీ దగ్గరకు రాకుండా నన్నెవ్వరూ ఆపలేరు!'' అతని వెచ్చని

## యోగా బాటలో శ్రియ....

ఒకప్పుడు యోగ చేయడానికి పెద్దగా ఎవరూ ముందుకి వచ్చే వారు కాదు. ఇప్పుడు పరిస్థితి మారింది. పనిలో ఒత్తిడి, చికాకులు, ఆందోళన తగ్గించుకుని, మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడానికి ఎక్కువ మంది యోగను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్లు యోగ బాటను పట్టగా, తాజాగా శ్రియ కూడా వారి బాటలోనే పయనిస్తోంది. ఇషా యోగకి ప్రతి రోజూ శ్రియ వెళుతోంది. యోగ వలన తనలో చాలా మార్పు వచ్చిందని, ఆ మార్పు ఫలితం త్వరలోనే చూడవచ్చని అంటోంది శ్రియ. ఇదిలావుండగా, శ్రియ యోగ చేయడంపై పలు విమర్శలు వినవస్తున్నాయి. ఇటీవల ఆమె సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్ కావడంతో దాన్ని తట్టుకోవడానికే యోగ క్లాసులకు వెళుతోందని పరిశ్రమలోని వారంటున్నారు.

ఊపిరి ఆమె ముఖానికి తగిలేటంత దగ్గరగా అతని ముఖం వుంచి గుసగుసగా అనే వాడు! ఊరికే ఊహల్ని వద్దని ఆపడం చాలాకష్టం! ఆ వూహలతో నిండిన కొత్త శక్తితో అన్నిపనులు ఆమె ఉత్సాహంగా చేసేది. రోజులు సంవత్సరాలుగా మారుతున్నాయి!! ఇప్పుడు రాజశేఖరం ఆమె ఊహల్లోకి అంతగా రావడం లేదు! తను ప్రేమించిన రాజశేఖరానికి తను స్వంతం కాలేక పోయిందన్న బాధ ఇప్పుడంతగా లేదు! అప్పుడు ప్రతి రోజూ వురుకులు - పరుగులతో ఆమె ఊహల్లోకి వచ్చిన రాజశేఖరం ఇప్పుడంతగా రావడం లేదంటే అది ఆమె వయసు తెచ్చే మార్పులే కారణం! ఇప్పుడామె మనసు ఆమె చెప్పినట్టు వింటోంది!!

శ్రీనివాసరావుకి భార్యంటే చాలా అభిమానం, వసుంధర కూడా ఎప్పుడు భర్తకి ఏ విషయంలోనూ ఎదురు చెప్పలేదు. వేళవేళలా భర్తక్కావల్సినవన్నీ సమకూరుస్తూ మంచి భార్యగా, మంచి ఇల్లాలుగా, మంచి తల్లిగా సర్టిఫికెట్లు సంపాదించుకుంది! కాలంతో పాటు వయసులో కూడా మార్పులు రావడం సహజం. శ్రీనివాసరావు గారు రిటైరయిన తర్వాత ఆ భార్యాభర్తలిద్దరూ పూర్తిగా ఆధ్యాత్మిక చింతనలో పడ్డారు. శ్రీనివాసరావుకి డబ్భై సంవత్సరాలు దాటి పోయాయి. వసుంధర శరీరం ముడతలు పడింది. జుట్టు నెరిసింది. ముందర పళ్లు రెండు వూడితే కట్టించుకుంది. ఇద్దరూ భగవద్గీత చదవడం మొదలెట్టేరు ఈ మధ్యనే. భూమిలోకి బలంగా వేళ్లు నాటుకు పోయిన మహా వృక్షాన్ని కూకటి వేళ్లతో సహా ఎవరో పెకిలించినట్టుగా అతని ఊహల్ని ఇప్పుడు ఆమె తన మనసులోంచి పూర్తిగా తొలగించేసింది. భక్తి మార్గం వైపు మళ్లిన ఆమె మనసుకి ఇప్పుడు రాజశేఖరాన్ని తల్చుకోవడానికి టైము లేదు!?!

నిజంగా మనసు చేసే గారడీలు అన్నీ - ఇన్నీ కావు. మనసు చాలా చిత్రమైనది! ప్రపంచంలో కెల్లా అంతు పట్టనిది ఎవరి మనసులో ఏముందో తెలుసుకోవడం! ఆమె మనసు లోపలి పొరల్లో ఒకప్పుడు రాజశేఖరం పట్ల "అలాంటి" ఊహలు వుండేవని; ఇప్పుడు ఎప్పుడైనా రాజశేఖరం ఆమె ఊహల్లోకి వచ్చినా అప్పటికీ - ఇప్పటికీ తేడా వుందని; ఇప్పుడు ఏదో స్నేహ పూర్వకంగా పలకరించడానికి వచ్చినట్టుగా వస్తున్నాడని ఆమె ఎవరికైనా ఎలా చెప్పి నమ్మించగలదు? చెప్పినా వినరు నమ్ముతారు? అయినా చెప్పవల్సిన అవసరం ఆవిడకి ఏముంది? ఆవిడ మనసు... ఆవిడ ప్రేమ... ఆవిడ ఇష్టం! ఎవరు కాదనగలరు? ఆవిడ మనసులోని అలజడి ఆ పరమాత్ముడికి తప్ప పరాయి వాళ్లకి తెలీదు.

***

గత స్మృతుల్లోంచి బయటపడి ఇవతలకి వచ్చి చూసింది వసుంధర. శ్రీనివాసరావు, రాజశేఖరం ఇంకా ఏదో మాట్లాడుకుంటూనే వున్నారు. రాజశేఖరాన్ని చూడగానే ఆవిడకొక చిత్రమైన ఆలోచన వచ్చింది. 'ఈ సమాజంలో పరస్పర ఆకర్షణతో, ఆపేక్షతో, అనురాగంతో కాపురాలు చేసే భార్యాభర్తలు తక్కువ! రెండు విరుద్ధ స్వభావాలతో వున్నా, సామాజిక కట్టుబాట్లని గౌరవించి, పరస్పర అవసరార్థం సర్దుకుపోయి కాపురాలుచేసే భార్యాభర్తలు ఎక్కువ!'

"వీళ్లు మన పక్కింట్లో కొత్తగా దిగేరు. మనకి మంచి కాలక్షేపం! అన్నట్టు మా ఆవిడది కూడా విజయనగరమే. మీరు చెప్పిన వీధిలోనే వుండే వారు. వాళ్ల వాళ్లంతా పోయేరు. ఇప్పుడక్కడ ఎవరూ లేరు!" అన్నాడు శ్రీనివారావు.

"అమ్మా! మీ పేరేమిటన్నారు?" రాజశేఖరం ఎంతో నమ్రతగా అడుగుతూంటే వసుంధరకి ఏడుపొచ్చింది. 'అతను నిజంగానే తనని పోల్చుకోలేదు! దళసరి కళ్లజోడు పెట్టుకున్నాడు. పాపం కళ్లు సరిగ్గా కనిపించవు కాబోలు!' అనుకునే సర్కి ఎంతో జాలేసింది ఆవిడకి, "నేను వసుని రాజశేఖరం!" అని భర్త ఎదురుగా ఎలా చెప్తుంది?

"నా పేరు వసుంధర. నేను ఫలానా వాళ్ల ఆడబడుచుని" జ్ఞాపకాలకి పదును పెడుతూ అంది. అలా అంటున్నప్పుడు ఆవిడ కళ్లల్లో దాచినా దాగని సంతోషం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"ఓహో! మీరా! అవును. మా వీధిలోనే వుండేవారు" అన్నాడు రాజశేఖరం ముక్తసరిగా. అతనికి జ్ఞాపకశక్తి పూర్తిగా తగ్గిపోయిందేమోనన్న అనుమానం ఆవిడకి మొదటిసారిగా కలిగింది! అతను చాలా మామూలుగా మాట్లాడుతున్నాడు. ఆనాటి రూపం ఏదీ రాజశేఖరానికి!?! తన ఊహల్లో వున్న రాజశేఖరం వేరు! ఇప్పుడు చూస్తున్న రాజశేఖరం వేరు! అసలు తను మాత్రం?! ఆనాటి వసుంధరేనా తను? ఇప్పుడు వార్ధక్య లక్షణాలతో ఏ మనోవికారమూ లేని వసుంధర తను!

కాని... కాని... ఎక్కడో ఏదో చిన్న అపశృతి?

"అతను తనని పోల్చలేక పోవడం ఏమిటి?" అన్న బాధ ఆవిడ మనసులో గుచ్చుకుంటున్నది!

పిసరంత ప్రాణం! రక్త మాంసాలతో నిండిన అస్తిత్వం లేని అస్తిపంజరం మనిషి ! ఈ శరీరంలో ఉడుకు రక్తం ఉరకలు వేస్తున్నన్నాళ్లు... ఎన్నెన్నో కోరికలు! ఎన్నెన్నో ఆశలు! ఎన్నెన్నో ఆకాంక్షలు! వయసు మళ్లి పోయి, జవసత్వాలుడిగిపోయి, వేడి రక్తం చప్పగా చల్లారిపోయి మరబొమ్మల్లా మనుషులు మారిపోయాక ఇంకేముంటుంది? ఏమీ వుండదు!!!

"బాగున్నారా?" జ్ఞాపకాలని తిరగతోడే ప్రయత్నం చేస్తూ అంది వసుంధర.

"బాగున్నానమ్మా" అన్నాడు అతను నవ్వుతూ.

అతను తనని పూర్తిగా మర్చిపోయేడని మనసులో నిర్ధారించుకుని భారంగా నిట్టూర్చింది ఆవిడ. కాని వసుంధరని చూడగానే రాజశేఖరం పోల్చాడని, తన ప్రాణంలో ప్రాణం అయిన తన ప్రియమైన వసుంధరేనని తెల్సి చాలా సంతోషించాడని వసుంధరకి తెలీదు!!

మరో వారం రోజుల తర్వాత వాళ్లు ఇల్లు ఖాళీ చేసి ఎక్కడికో వెళ్ళిపోయారని తెలిసింది వసుంధరకి! ఆవిడ ఎందుకో క్షణకాలం పాషాణంలా బిగుసుకుపోయింది.

అసలు రాజశేఖరం వసుంధరని మర్చిపోతే కదా గుర్తు చెయ్యడానికి!!!

'ప్రశాంతంగా సాగే సరోవరంలో చిన్న రాయిపడినా నీరు అల్లకల్లోలం అయిపోతుంది' అనుకున్నాడు విరక్తిగా రాజశేఖరం !?!!

*


చిరునామా:
శ్రీమతి న్యాయపతి కమలారాంజీ
వైఫ్ ఆఫ్ ఎస్.వి.రమణమూర్తి (రాంజీ)
**49-26-53,** ఎస్-3 ప్రసీధ రెసిడెన్సీ
మొదటి లేన్, మధురానగర్
విశాఖపట్నం - **530 016.**
మొబైల్: **93923 90211**




## శ్రద్ధా ఆర్యాతో పోసాని రొమాన్స్

దర్శకుడు, రచయిత పోసాని హీరోగా కూడా బాగా సక్సెస్ అయ్యాడు. హాస్యం, వ్యంగ్యం కలబోసిన డైలాగులతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాడు. పోసాని చిత్రాలకు మినిమమ్ గ్యారంటీ ఉండడంతో నిర్మాతలు కూడా. పోసానినే ఎక్కువ ప్రిఫర్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోసాని తాజాగా 'తింగరోడు'లో అందాల భామ శ్రద్ధా ఆర్యాతో రొమాన్స్ చేయబోతున్నాడు. సినిమాలో వీరిద్దరి రొమాన్స్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని, ఇదే ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని చిత్ర నిర్మాత, దర్శకుడు కె.వాసు తెలిపారు.